# గెలుపు

రచన:
ద్విభాష్యం రాజేశ్వరరావు

నిండు పున్నమి రాత్రి. సుధాంశుడు చల్లని వెలుగుతో లోకాన్ని పాలిసున్నాడు. ఏపుగా పెరిగిన పచ్చని ముద్దబండి పూలు బంగారపు ముద్దల్లా కిటికీ చుట్టూ అల్లుకొన్న మాలతీలత మెల్ల గాలీచే నైట్ క్వీన్ పరిమళాన్ని నింపుకొంస్తోంది. కిటికీ చుట్టూ అల్లుకొన్న మాలతీలత మెల్లగా గాలికి తల లూపుతోంది.

బధకంగా ఆవులించి కిటికీవైపు నుండి తనచూపులను మరల్చుకొంది రజని! బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర రావటం లేదు. అప్పుడే గంటనుంచి ఈ ప్రయత్నం! కాని కృతకృత్యురాలు కాలేక పోతోంది.

గుండెల్లో భరించలేని నొప్పి!...ఆరని మంటలా మిగిలిపోయింది.

ఒంటరిగా వుంటే వెంటబడే ఆలోచనలు...! నిద్ర ఎలా పడుతుంది?

దాహంతో గొంతుక పిడచకట్టుకు పోతోంది. గుండెను గట్టిగా అదిమి పట్టుకొని బాధగా లేచింది రజని, మంచం ప్రక్కనే వున్న కూజానుండి నీళ్లు వంపి కొంచెం త్రాగి మళ్లీ మంచం మీద వాలిపోయింది.

వాతావరణంలోని ఆహ్లాదం, కూజా నీటిలోని చల్లదనం, తనలోని బాధాగ్ని చల్లార్చలేక పోతున్నాయి. లంకంత కొంపలో కొవ్వొత్తిలా—మిగిలింది తను!

పేరుకు మనిషిగా మిగిలినది రజని...అంతే! తనలోని ఆనందం ఏనాడో ఇంకిపోయింది! ఎటుచూసినా మంచులా తెరతెరలుగా కప్పివేస్తున్న బాధలు! ఊడలు కట్టి దిగుతున్న భయం! ఇంత వెన్నెలలోనూ చుట్టూ చీకటి పేరుకొని గడ్డ కట్టినట్లుంది!

భర్త!—హోదాలో వున్న ప్రభుత్వోద్యోగి! అంతులేని ఆస్తివుంది! ధనం సుఖాన్ని కొనలేదు! అనురాగాన్నివ్వలేదు! ఈ సంగతులు జీవితంలో అడుగుపెట్టాక గాని అనుభవంలోకి రావటంలేదు.

తప్పత్రాగి రాత్రి ఏ పన్నెండుగంటలకో ఇంటికి వస్తాడు రావ్! పెళ్ళయిన క్రొత్తలో అంతా వింతగా వుండేది తనకు. తరువాత పరిస్థితి పాతబడిపోయింది! ఆ దురభ్యాసం మానమని భర్తతో వేలసార్లు మొరపెట్టుకొని వుంటుంది! అంతకంటె చెవిటివాడి ముందె శంఖం పూరించటంనయం! త్రాగడుమానమని చెప్తే రావ్‌కు విషప్రాయంగా వుంటాయా మాటలు!

అదేమి విచిత్రమో తను ఎంత బాధపడినా, భర్త ముఖం చూశాక కఠినంగా మాట్లాడా లనిపించదు. అమాయకంగా కనిపించే ముఖం అందమైన చిన్ననోరు, నొక్కులజుత్తు చూస్తూ అతనికి వశమయి పోతుంది! త్రాగుడు మైకం కాస్త వదిలేస్తే ఎంతో ప్రేమగా చూస్తాడు తనను! తన ఆరోగ్యంకోసం బోలెడు ధనం వెచ్చిస్తున్నాడు. ఇంతకీ తన విధి వ్రాత బాగలేనప్పుడు ఎవరేమి చెయ్యగలరు?

రజని మనసంతా మలినమైనట్లు వుంది! నిశాకన్య పన్నెండోగంట మీద నృత్యం చేస్తోంది! తన బ్రతుకులాగే—దీనంగా వెలుగుతోంది నైటు బల్బు!

పోర్టికోలో కారాగిన శబ్దం! బయటకు చూపులు మళ్ళించింది రజని!

కారుడోర్ తీసి తూలుతూ వస్తున్నాడు రావ్!

దీర్ఘంగా నిట్టూర్చింది రజని!

* * *

రాత్రంతా మత్తుగా నిద్రించి అప్పుడే మేల్కొన్న ప్రియ సఖిలావుంది ప్రాతఃకన్య!

'ఎలావుంది రజనీ?' మెల్లగా తల నిరుముతూ అన్నాడు రావ్!

రజని మెల్లిగా కళ్ళు తెరిచింది!

ప్రక్కనే కూర్చుని తన ముఖంలోకి ప్రియంగా చూస్తున్న భర్త!

భర్త ముఖంలోని ఆవేదన సంఘర్షణచూచి విచలితురాలయింది రజని!

అతనిమీద ప్రయోగించటానికి మనసులో దాచిన కోపం, కఠినత్వం అన్నీమనసునుండి తుడిచిపెట్టుకు

పోయాయి! మనసు స్వాధీనాన్ని కోల్పోతున్నట్టనిపించింది!

'బాగానేవుంది!' హీన స్వరంతో పలికింది.

'నన్ను క్షమించు రజనీ! రాత్రి పశువులా ప్రవర్తించాను నీ ఆరోగ్యం గురించి అడగాలన్న జ్ఞానంకూడా లేక పోయింది! ఆ! డాక్టరుకు ఫోన్ చేశాను ఇప్పుడే వస్తాడు! ఇదిగో కాఫీతీసుకో!'

అప్రయత్నంగా కళ్ళు చెమ్మగిల్లాయి. సాధారణంగా ప్రతి స్త్రీలో వుండే ఈ బలహీనత్వానికి కారణమే రజనికి తెలియదు!

'అదేమిటి రజనీ? అలా చిన్నపిల్లలా ఏడుస్తావా! లేచి కాఫీ త్రాగు! నువ్వు ఏడిస్తేనే చూడలేను!' తల మెల్లిగా నిరుముతూ అన్నాడు.

మనసులో అనురాగాన్ని నింపుకొన్న గొడ్డీ దుఃఖం ఎక్కువవటం సహజమేమో!

భర్త కంఠంలోని గద్గదికాన్ని సులువుగా గుర్తుపట్ట గలిగింది రజని!

రావ్ ఆమెచేత కాఫీ త్రాగించాడు.

అతని చేతుల్లో ఆమె స్వర్గాన్ని నరకాన్ని రెండిటినీ చూస్తుంది!

తనంటే భర్తకు చాలా ప్రేమ! కాని తన భర్త దురలవాట్లలో ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నాడనే తన భాధ!

'ఏమండీ! మీకోసం రాత్రి ఎలా ఎదురు చూశానో తెలుసా?'

మొహం ప్రక్కకు తిప్పుకొన్నాడు రావ్!

'మీరు రోజు రోజుకూ మరీ బలహీనంగా తయారవుతున్నారు! పెళ్లయిన క్రొత్తలో ఎలావుండేవారో తెలుసా?'

'ఊ! ఎలా వుండే వాణ్ణి?' గోముగా అడిగాడు.

'చాలా అందంగా, దారుఢ్యంగా వుండేవారు!... నేను కోరేదొక్కటే! నా కోర్కె మీరు తీర్చటం లేదు!'


# SURIA HOSIERY MILLS

**AVANASHI ROAD : : TIRUPUR-2 (S.I).**

# = సురియా =

**హొయ్‌సరీసలో అతి ప్రఖ్యాతి చెందినది.**

★

**ఆంధ్రప్రదేశంలోని ప్రతి జిల్లాలోనూ ఏజెంట్లు, స్టాకిస్టులు కావలెను.**

**వెంటనే వివరములకు వ్రాయండి.**

రావ్ ముఖంలో రంగులు మారిపోయాయి. మారిపోతాయని రజనికి తెలుసు.

'నువ్వు కోరేది ఏమిటో నాకు అర్థమయింది! నేను నీకు మాట ఇచ్చినా నిలబెట్టుకోలేను! నిలబెట్టుకోలేని వాగ్దానాలు చెయ్యటమంటే నాకు అసహ్యం! రోజూ నువ్వు ఈ దీర్ఘవ్యాధిలోపడే బాధ నేను చూడలేను. నా దృష్టిలో నువ్వు అప్సరసవి! దేవకన్యవి! నువ్వుపడే బాధ నేను మనసులో ఊహించలేను!...నాకు ఆ తాగిన మైకంలో నయినా శాంతి!...ఆ శాంతి మెలగనియ్! ఆ కొంత సమయమయినా స్వర్గంలో వుండనియ్యి! నేను తాగేది ప్రస్తుతం—నీకోసం—నీకోసం...నీకోసం!'

మంచం దిగి విసురుగు వెళ్ళిపోయాడు రావ్!

తలదిండులో ముఖం దాచుకొని కలవలా ఏడ్చింది రజని!

'తాగుడు మానమని చెప్పేసరికి ఆయనకు ఎక్కడలేని క్రోధం ముంచుకొస్తుంది! కానీ నాఆనారోగ్యాన్ని ఎందుకు సృష్టించావు దేవా! ఆయనకైనా సుఖాన్నియి!'

పోర్టికోలోంచి కారు వెళ్ళిపోతున్న శబ్దం రీలగా విన్పించింది ఆమెకు.

× × ×

సాయంత్రం అయిదుగంటలకు ఆఫీసునుండి తిరిగి వచ్చాడు రావ్! గదిలో అడుగు పెడుతూ లోపలి దశ్యం చూసి మ్రాన్పడి తలుపు దగ్గరే వుండిపోయాడు.

క్షణంసేపు నోట మాట రాలేదు. ఎదురుగా టేబిల్‌పైన బ్రాందీ వెక్కిరిస్తోంది.

సగంతాగిన గ్లాసు చేతిలో పట్టుకొని కిటికీవైపు చూస్తోంది రజని!

కోపం పట్టలేకపోయాడు రావ్!

'రజనీ!' గర్జనకు గది ప్రతిధ్వనించింది!

రజని మెల్లిగా తలఎత్తి చూసింది. కళ్ళు బరువుగా అరమోడ్పుగా వున్నాయి.

ఒక్కక్షణం రావ్ ముఖంలోకి చూసి నిర్లక్ష్యంగా నవ్వుతూ గ్లాసు నోటివద్ద ఉంచుకోంది.

అంతే! విసురుగా వెళ్ళి చేతిలోని గ్లాసు లాక్కొని ఆమె చెంప ఛెళ్ళుమనిపంపించాడు రావ్!

గులాబీ రేకులాంటి ఆమె చెంప ఎర్రబారింది.

బ్రాందీసీసా బలంగా నేలకేసి కొట్టాడు. గాజు ముక్కలు చెల్లాచెదురుగా తూలిపోయాయి! పాపం పరిచినట్లు బ్రాందీ నేలమీద అలుముకోంది!

రజనీ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. బలంగా కళ్ళుమూసుకోంది. అశ్రువులు ఎర్రని కపోలంమీదుగా జాలునారాయి.

ఆమెముఖం చూసేసరికి రావ్ కోపమంతామంచులా కరిగిపోయింది!

ఆమెను లేవదీసి గుండెలకు హత్తుకొన్నాడు. అతని వక్షంలో తలదాచుకొని వెల్లుసలా ఏడ్చింది.

'ఏమిటి రజనీ ఈ పని! అసలే నీ ఆరోగ్యం మంచిది కాదు! దీనికితోడు ఇదికూడానా! ... రజనీ! నన్ను జయించావ్! — నువ్వే గెల్చావు: పాడు తాగుడువద్దు! నువ్వేకావాలి ... నువ్వే!' అమెను గట్టిగా హత్తుకొన్నాడు.

రజని మనసు తెలియని తృప్తితో నిండిపోయింది. ఆమెలో వెల్తి అన్నది లేకుండా పోయింది, వెయ్యిజ్యోతులు మనసులో ఒక్కసారి వెలిగినట్లయింది!

× × ×

'రజనీ!' ముద్దుగా పిలుస్తూ గదిలోకి అడుగు పెట్టాడు రావ్!

రజని ఇంకా నిద్రపోతూనే వుంది.

'రజీ!' మెల్లగా తడుతూ లేపాడు.

ఆమెలో చలనంలేదు!

రావ్ మనసులో ఏదో విషంలాటి అనుమానం పొడచూపింది.

'రజీ!' ఆమెను బలంగా కుదిపేశాడు. నిర్జీవ ప్రతిమలకు మానవుని పిలుపే ప్రాణం పొయ్యగలిగితే ప్రపంచం ఈ నాటికి ఊహించని ఉచ్ఛస్థితిలో వుండేది!

రావ్‌కి కాళ్ళు చేతులు ఆడటంలేదు. ఫోన్ తీసి డాక్టరుకు రింగుచేశాడు.

'డాక్టరుగారూ! త్వరగా రావాలి! రజనికి ఒంటిమీద స్పృహ ఉన్నట్టులేదు!'

కొద్దిసేపట్లో డాక్టరు వచ్చాడు! వచ్చిన డాక్టరు వెళ్ళిపోయాడు!

రజని మరో లోకాలకు వెళ్ళిపోయింది!

రావ్ మనసు పనిచెయ్యటం మానేసింది! ఆ పరిస్థితిలో రావ్‌కు ఒక్కటే స్ఫురిస్తుంది. 'రిఫ్రిజిరేటర్' తెరిచాడు.

సీసాలోని 'విస్కీ' ఉల్లాసంగా నాట్యంచేస్తూ విజయగర్వంతో గ్లాసులోకి ఒలికింది, గెలుపు నాదే అన్నట్లు!